# మామూలు

**వృత్తిలోగాని** ప్రవృత్తిలోగాని తోటివారు ఓ మెట్టు పై నుంటే అసూయ కలగడం సహజం. అది మానవ నైజం. అందులో ఎవరికీ మినహాయింపు ఉండదు. కాకపోతే వాళ్ళలో తేడా ఉంటుంది.

రంగన్న అంటే లింగన్నకి కడుపుమంట. వృత్తిలో ఇరువురూ పోస్టుమ్యాన్లే అయినా పై రాబడిలో తేడా వుండటం అందుకు కారణం.

రంగన్న మెయిన్ బజారువార్డులో ఉత్తరాలు పంచితే లింగన్న మధ్య తరగతి వాళ్ళున్న ప్రాంతంలో ఉత్తరాలు బట్వాడా చేస్తుంటాడు.

పండగ సమయాల్లో డబ్బు విదిలించడంలో సహజంగా వ్యాపారస్తులదే పైచేయి! ఆ కారణంగా రంగన్న దసరా పండగ తోటి వారందరికంటే ఘనంగా జరుపుకోగలుగుతున్నాడు. అటువంటప్పుడు రంగన్నంటే లింగన్నకి కన్నెర్ర కాదూ?!

అసూయపడినంత మాత్రాన స్థితులు మారిపోవన్న సంగతి లింగన్నకి తెలుసు. అందుకే ఆ నేలలో అందుకున్న ఎరియర్సు తనవికావనుకుని అధికారుల్ని ప్రసన్నం చేసుకున్నాడు.

సరిగ్గా దసరా పండుగ ముందర రంగన్నని మరో ప్రాంతానికి బదిలీ చేసి ఆ స్థానంలో లింగన్నను నియమించడం జరిగింది.

ఎదురు చూస్తున్న దసరా పండుగ రానే వచ్చింది.

ఆశలు ఫలించే రోజు దగ్గర పడింది.

విజయదశమి వారం రోజులుందనగా పండగ ఇనాముల కోసం ఎగబడ్డాడు.

ఓ పెద్ద వస్త్రాలయం ముందు సైకిలు దిగి షాపు యజమానికి సలాము కొట్ట చిన్న పుస్తకాన్ని అందించాడు లింగన్న.

"ఈ మధ్యే కదా నువ్వీ వార్డుకి వచ్చావ్. అందుకని మా పాత పోస్టుమ్యాను రంగన్నకి దసరా మామూలిచ్చేసాం" తాపీగా పలికాడు షాపు యజమాని.

షాక్ తిన్నాడు లింగన్న.

'అదేంటి సార్. మీ అందరికీ ఉత్తరాలు పంచేది నేనైతే, మామూలు రంగన్నకివ్వడమేంటి?"

"నువ్వు నిన్నకాక మొన్న వచ్చావు. సంవత్సరం పొడుగునా సేవలందించాడు రంగన్న. అటువంటప్పుడు మామూలు అతడికి ముట్టచెప్పడమే న్యాయం కదా?... అలా అని నువ్వేం నిరాశపడకు. వచ్చే సంవత్సరం మేమిచ్చే మూమూళ్ళన్నీ నీవే" ధర్మసూత్రం చెబుతూ అభయమిచ్చాడు షోరూము యజమాని.

లింగన్నకి మరి ఆ రోజు ఉత్తరాలు పంచిపెట్టబుద్ధి కాలేదు.

పోస్టు వచ్చిందా అని ఎవరు అడిగినా లేదు లేదంటూ నిరాశగా ఇంటి ముఖం పట్టాడు.

అంతలోనే అంధకారంలో ఆశా కిరణంలా ఓ మెరుపులాంటి ఆలోచన స్ఫురించింది.

వ్యాపారస్తులు చెప్పిన న్యాయసూత్రం తనకు మాత్రం ఎందుకు వర్తించదు? పాత వార్డులోకెళ్ళి కొద్దోగొప్పో మామూళ్ళు వసూలు చేసుకుంటే తన స్థితి గుడ్డిలో మెల్లయినా అవుతుంది కదా.

ఆ తలంపు రావడం తడవు ఇది వరకు తను ఉత్తరాలు బట్వాడా చేసే లొకాలిటీలోకెళ్ళి ఒక ఇంటి తలుపు తట్టాడు.

"మొన్ననే మా పోస్టుమ్యానుకి డబ్బులిచ్చేసాం. ఇన్నాళ్ళ బట్టి నువ్వేమయ్యావ్?" అపరాధిని నిలదీసినట్లు అడిగాడు ఇంటి పెద్ద.

"మరో ప్రాంతానికి ట్రాన్స్ఫర్ అయానులెండి. అది సరే, సంవత్సరమంతా ఉత్తరాలిచ్చింది నేనైతే డబ్బులు అతడికిచ్చారేంటీ?"

బాధ, కోపంతో రుద్ధమైందతడి కంఠం.

"మళ్ళీ నువ్వొస్తావని మేమేమైనా కలగన్నామా? ఆ మాట ముందుగా వచ్చి చెప్పి వుంటే బావుండేది"

మరి మాట్లాడలేదు లింగన్న.

అత్యాసకు పోవడం వల్ల తన స్థితి రెంటికీ చెడ్డ రేవడయింది. రంగన్న ఘటికుడు. ముందుచూపున్నవాడు గనకనే ముందుగానే మేల్కొని బదిలీ అయిపోయినా, రావలసిన మొత్తాన్ని వసూలు చేసుకోగలిగాడు. ఈ ఆలోచన లింగన్నని మరింత కృంగదీసింది.

**(27-4-2000, ఆంధ్రభూమి వీక్లీ)**